
సాక్షి ఒడిశా

బుధవారం । 20 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.2,86,835
బంగారం	4 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
వెండి	190 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

వంతెనపై అదుపు తప్పిన వ్యాన్



సబ్ డివిజన్ కుద్రా సమితి భుషంగగుడ పంచాయతీ ఖటలపోదర్ గ్రామం వద్ద కొలాబ్ వంతెనపై అదుపు తప్పి వ్యాన్ జారిపడిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, 10 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. - 8లో.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
బుధ	గురు
6.03	4.36

న్యూస్‌రీల్

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డీన్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రఫుల్ల పండా, డీన్ స్టూడెంట్స్ డా.రితీష్ కుమార్, కో–ఆర్డినేటర్ డా.ప్రజ్ఞాపాణిలు ప్రారంభించారు. మొత్తం 111 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. జిల్లా బ్లడ్ బ్యాంక్ సీనియర్ ఫార్మసిస్టు ఖగేశ్వర బెహరా, ఇతర టెక్నిషియన్లు సహకారం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల కో–ఆర్డినేటర్ సుశాంత కుమార్ పట్నాయిక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శుభ్రమయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



ఘటన స్థలంలో ఈశ్వర్ మృతదేహం



జి.ఈశ్వర్ (ఫైల్)

కొరాపుట్: ఇంటర్ పరీక్షలు రాయడానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నబరంగ్‌పూర్ కేంద్రీయ విద్యాలయంలో ప్లస్ 2 చదువుతున్న జి.ఈశ్వర్ (17) ఇంటర్ పరీక్షలు రాయడానికి స్కూటీ మీద పపడాహండి వెళ్తున్నాడు. అయితే అతడిని డీర్ పార్క్ సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యాన్ ఢీకొని వెళ్లిపోయింది. దీంతో ఘటన స్థలంలోనే ఈశ్వర్ మృతి చెందాడు. స్కూటీ వెనుకనున్న అతని మిత్రుడు ఆకాష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈశ్వర్ తండ్రి జి.శేఖర్‌రావు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర బస్టాండ్ సమీపంలో సెలూన్ నడుపుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే పపడాహండి ఎస్‌డీపీవో మీనాక్షి ఠాకూర్, ఐఐసీ దీపక్ జెన్నాలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పపడాహండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

కిడ్నాప్ కేసులో మరొకరు అరెస్టు





అరెస్టైన పరదేశి టక్రి, నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైక్

జయపురం: బీహార్‌కు చెందిన ఒక యువకుడిని స్నేహం పేరుతో జయపురం రమ్మని పిలిచి అతడిని కిడ్నాప్ చేసిన ఉదంతం గతేడాది సెప్టెంబర్‌లో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో మరొకరిని అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి సోమవారం తెలియజేశారు. అరెస్టైన వ్యక్తి గొడొపాదర్ పంచాయతీ డొముగుడ గ్రామానికి చెందిన పరదేశి హరిజన్ ఉరఫ్ టక్రి(27)గా పేర్కొన్నారు. అతడి వద్ద నుంచి కిడ్నాప్‌కు వినియోగించిన బైక్ సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ కేసులో ఇంతవరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

నలుగురు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులు



మాట్లాడుతున్న ఎస్పీ సార్వణ్ వివేక్

బరంపురం: ఇటీవల నగర శివారులోని రఘుపతి నగర్‌లో నివాసముంటున్న టుకునా బూంయ్య ఇంటిలో బాంబుదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, వారి దగ్గర నుంచి ఒక ఇనుప కత్తి, ఒక బాంబు, 3 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ఈ మేరకు బరంపురం పోలీసు కార్యాలయంలో ఎస్పీ సార్వణ్ వివేక్ మంగళవారం మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. వ్యక్తిగత కక్షలతోనే దాడి జరిగినట్లు పేర్కొన్నారు. అరెస్టైనవారిలో గంజాం జిల్లా ఘాటీ కాలువకి చెందిన సుదర్శన పాడి, సుమన్ పట్నాయక్, డిప్పు సాహు, కాలియా సాహులు ఉన్నట్లు తెలియజేశారు.

ఓటర్ ఒక్కరే.. ఓట్లు రెండు..!



ఒక నాయకుడు రెండు చోట్ల పోటీ చేస్తాడు. మరి ఒక ఓటర్ రెండు ఓట్లు వేయలేరా..? ఒకరిద్దరు కాదు ఏకంగా 21 గ్రామాల ప్రజలకు రెండు ఓట్లు ఉన్నాయి. ఇదేమీ రహస్యంగా జరుగుతున్న వ్యవహారం కాదు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలు అంగీకరించిన విషయం. ఈ రెండు రాష్ట్రాల్లోని సరిహద్దు వివాదాస్పద ప్రాంతం కొఠియా గ్రామాల ప్రజలకు ఈ అవకాశం ఉంది. వీరు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మే 13వ తేదీన ఒకేరోజు ఇరు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలను ఎన్నుకోనున్నారు. అంతేకాదు వీరు ఇదివరకే వార్డు మెంబర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ఇద్దరేసి నాయకులను ఎన్నుకున్నారు.

- వివాదాస్పద కొఠియా గ్రామాల్లో వింత పరిస్థితి
- 21 గ్రామాల ప్రజలకు రెండు రాష్ట్రాల్లో ఓట్లు
- ఒకే రోజు రెండు రాష్ట్రాల ప్రజా ప్రతినిధులను ఎన్నుకోనున్న ప్రజలు



కొఠియాలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణ



కొఠియాలో పర్యటిస్తున్న కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్

2024 సార్వత్రిక సమరం

కొరాపుట్:

ప్రస్తుతం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితిలో కొఠియా పంచాయతీ ఉంది. ఆ ప్రాంతం ఒడిశా రికార్డుల్లో ఒడిశాకే చెందినది. అదే ప్రాంతం మన్యం పార్వతీపురం జిల్లా సాలూరు మండలంలో ఆంధ్రా రికార్డుల్లో ఉన్నాయి. బ్రిటిష్ వారు చేసిన అనేక తప్పిదాల్లో ఇదొక్కటి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇరు రాష్ట్రాల ఆ ప్రాంతం తమదంటే తమదేనని వాదనలకు దిగాయి. చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. 1968లో సుప్రీంకోర్టు కొఠియాపై స్టేటస్ కో ఆదేశాలు జారీచేసి, తీర్పు వచ్చేవరకు యథాతథ స్థితిలో ఉండాలని ఆదేశించింది. అనంతరం రెండు రాష్ట్రాలు ఆ ప్రాంతంలో యథాతథంగా తమ తమ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నాయి.

ప్రత్యేక శ్రద్ధ

ఈ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని ప్రాంతాల మాదిరిగానే సమాన దృష్టిలో చూస్తోంది. ఇక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తోంది. అయితే ఒడిశా రాష్ట్రం మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గత పదేళ్లుగా సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసింది. కొఠియా మొత్తం రోడ్లు వేసింది. రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం అమలు అయినా కొఠియాలో పూర్తి స్థాయిలో జరిగేలా చూస్తున్నారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నుంచి ఏ ఉన్నత స్థాయి అధికారి కొరాపుట్ జిల్లాకి వచ్చినా కొఠియా తప్పనిసరిగా వెళ్తున్నారు. ఆ ప్రాంతంలో గిరిజన జీవనోపాధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

అన్నీ రెండేసి..

కొఠియాలో మొత్తం 21 గ్రామాలు ఉన్నాయి. ఒడిశా ఈ గ్రామాలన్నింటినీ కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేసింది. అదనంగా వివాదం లేని రెండు గ్రామాలను ఈ పంచాయతీలో చేర్చింది. ప్రస్తుత రికార్డుల ప్రకారం సుమారు 8,000 మంది ఓటర్లు ఆ ప్రాంతంలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ మాత్రం వివాదాస్పద గ్రామాలను విభజన చేసి 5 గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. గంజాయిభద్ర, పట్టు చెన్నూరు, పగులు చెన్నూరు గ్రామ పంచాయతీలు పూర్తిగా కొఠియా గ్రామ పంచాయతీలుగా ఉన్నాయి. సారిక, కురుకుటి గ్రామ పంచాయతీల్లో కొన్ని కొఠియా గ్రామాలు ఉన్నాయి. ఆంధ్రా రికార్డుల ప్రకారం ఈ ప్రాంతంలో 4,800 మంది ఓటర్లు ఉన్నారు. దీంతో ఈ 4,800 మందికి రెండు రాష్ట్రాల ఓటరు కార్డులు ఉన్నాయి. అలాగే రెండు ప్రభుత్వాలు రేషన్ కార్డులు, పింఛన్లు ఇస్తున్నాయి. రెండు రాష్ట్రాల పోలీసులు వచ్చి వెళ్తుంటారు. అంగన్‌వాడీ నుంచి విద్యుత్ వరకు రెండేసి సహాయాలు అందుతుంటాయి. ప్రజాప్రతినిధులు కూడా ఇరురాష్ట్రాల నుంచి వార్డు మెంబర్, సర్పంచ్, సమితి సభ్యుడు, జెడ్పీటీసీ ఇలా ముఖ్యమంత్రి వరకు ఇద్దరిని ఎన్నుకుంటారు.

మొదటిసారి ఒకేసారి ఎన్నికలు

ఇక్కడి ప్రజలు రెండు రాష్ట్రాల సార్వత్రిక, పంచాయతీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకుంటారు. ఒక్కసారి మధ్యంతర ఎన్నికల్లో తప్ప, ఎప్పుడూ ఈ ప్రాంతంలో ఒకేసారి రెండు రాష్ట్రాలకు పోలింగ్ జరగలేదు. దీంతో ఇరు రాష్ట్రాల పోలింగ్ అధికారులు ప్రశాంతంగా తమపని పూర్తి చేసుకొని వెళ్లిపోయేవారు. 1996 మధ్యంతర ఎన్నికల్లో ఒకేరోజు రెండు రాష్ట్రాలకు ఒకేరోజు పోలింగ్ తేదీ పడింది. దీంతో సిబ్బంది గొడవలు జరగకుండా ఉండడానికి ఒక రాష్ట్రం తరుపున ఒక వేలికి, మరో రాష్ట్రం తరుపున మరో వేలికి ఇంకుచుక్క పెట్టారని అప్పటి ఓటర్లు పేర్కొంటారు. కానీ ఇది అధికారికంగా జరగలేదు. మరలా చాలాకాలం తర్వాత ఈ సార్వత్రిక ఎన్నికల్లో మే 13వ తేదీన ఒకేసారి ఎన్నికలు రావడంతో అధికారుల్లో టెన్షన్ మొదలైంది. ఈసారి ఈ గండం గట్టెక్కాలంటే కష్టమే. ఈ గ్రామాలు ఒడిశాలో కొరాపుట్ లోక్‌సభ, పొట్టంగి విధానసభ ప్రాంతం వైపు వస్తాయి. ఆంధ్రాలో అరకు లోక్‌సభ, సాలూరు విధానసభ పరిధిలోనికి వస్తాయి. వీరు ఒకేరోజు ఇద్దరు ఎంపీలకు, ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులకు రాజ్యాంగ బద్ధంగా ఎలా ఓటు వేస్తారో..? దీనికి రెండు రాష్ట్రాల అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

ప్రకటనల పిటిషన్‌పై జోక్యం చేసుకోలేం

- స్పష్టం చేసిన ఒడిశా హైకోర్టు

భువనేశ్వర్: ప్రభుత్వ ప్రకటనల్లో అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) పార్టీ తమ గుర్తు 'శంఖాన్ని' ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ దశలో జోక్యం చేసుకోమని ఒరిస్సా హై కోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) విచారణ జరుపుతోందని పేర్కొంది. బీజేపీ నేత జతిన్ మహంతి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ అంశంపై భారత ఎన్నికల సంఘం నిర్ణయం పిటిషనర్‌కు సంతృప్తికరంగా లేకుంటే, కేసును విచారణకు తీసుకోవచ్చని కోర్టు పేర్కొంది.

ఇదివరకే బీజేడీకి నోటీసులు

భారత ఎన్నికల సంఘం ఈ కేసుపై విచారణ ప్రారంభించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, బిజూ జనతా దళ్‌కు ఇదివరకే నోటీసులు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో ఈ సమస్యపై జోక్యం చేసుకోబోమని హైకోర్టు పేర్కొంది. రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి జతిన్ మహంతి గతంలోనే ప్రభుత్వ ప్రకటనల్లో బీజేడీ శంఖం గుర్తును ఉపయోగిస్తున్న విషయం భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకుని వెళ్లారు. అధికార పార్టీ గుర్తుతో కూడిన ఇటువంటి ప్రకటనలు భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. 2 నెలలుగా ఈ విషయంలో భారత ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ అంశం వేరే అధికార పరిధిలోకి వస్తుందని, పిటిషనర్ సరైన ధర్మాసనాన్ని ఆశ్రయించవచ్చనే పరిశీలనతో సుప్రీంకోర్టు కేసును ప్రాథమిక (అడ్మిషన్) దశలోనే రద్దు చేసింది. తర్వాత బీజేపీ నాయకుడు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ న్యాయస్థానం కూడ సుప్రీంకోర్టు సూచన ప్రకారమే ఒరిస్సా హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సలహా ఇచ్చి కేసు విచారణ ముగించింది. దీంతో ఆయన ఒరిస్సా హైకోర్టును ఆశ్రయించారు. ఇంతలో ఈ విషయంపై భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వం, బిజూ జనతా దళ్ నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది.

ఎన్నికల 'వేడి'

- ఏప్రిల్, మే నెలల్లో అధికంగా ఎండలు: ఐఎండీ
- ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు

భువనేశ్వర్: ఏప్రిల్ 19వ తేదీ నుంచి జూన్ 1 మధ్య దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. దేశంలో ఈ మహత్తర ప్రజాస్వామ్య పండగకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ వ్యవధిలో వేసవి వాతావరణం నెలకొని ఉంటుంది. ఏప్రిల్, మే నెలల్లో ఒడిశా సహా చాలా రాష్ట్రాల్లో అధికంగా ఉష్ణోగ్రతలు ఉంటాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందస్తు అంచనా వేసింది. అటువంటి సమయంలో ఎన్నికల ఊరేగింపులు, అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఇంటింటికీ ప్రచారం చేయడం వంటి కార్యక్రమాలు పుంజుకుంటాయి. ఈ పరిస్థితుల్లో వడదెబ్బ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ ప్రమాదం బారిన పడకుండా ఎన్నికల ప్రచారం, పోలింగ్ ఎలా నిర్వహించాలనే యోచనతో ప్రభుత్వ వర్గాలు ఆచితూచి అడుగు వేస్తున్నాయి. ఒడిశా ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులతో మేధోమథనం చేసి జిల్లాస్థాయిలో ఆకస్మిక ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశించారు.

జూన్ వరకు వేసవి తీవ్రత

ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు వేసవి తీవ్రత ఉంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో దేశంలో పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రాలు వడదెబ్బ నివారణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కేంద్ర హోం శాఖ అధీనంలో ఉన్న జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఎంఏ) ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సహాయ కమిషనర్లకు ఈనెల 6వ తేదీన లేఖ ద్వారా తెలియజేసింది. ఐఎండీ 5 రోజుల వాతావరణం ముందస్తు అంచనాతో నిత్యం 2 సార్లు బులెటిన్లు విడుదల చేస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలు ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో వడగాడ్పుల వైపరీత్యం ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు సూచించింది. గత నెల 29న ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కూడా రాష్ట్రాలకు వడ దెబ్బ నివారణ నిబంధనలను జారీ చేసింది. ఎన్‌డీఎంఏ అధికారుల లేఖ ఆధారంగా ప్రత్యేక సహాయ కమిషనర్ కమిషనర్ (ఎస్ఆర్‌సీ), అదనపు చీఫ్ సెక్రటరీ సత్యబ్రత్ సాహు రాష్ట్రంలో జిల్లాల మెజిస్ట్రేట్లను వడగాడ్పుల వైపరీత్య నివారణ ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున ఊరేగింపులు నిర్వహించనున్నారు. వేలాది మంది ప్రజలు పాల్గొంటారు. ఈ పరిస్థితుల్లో వడ దెబ్బ వంటి సమస్యలు తలెత్తవచ్చు. దీనిని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం వివిధ శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుంటుంది. సాధారణ ఎన్నికలు–2024 దృష్ట్యా వడగాడ్పుల ఆకస్మిక ప్రణాళికను సిద్ధం చేస్తుంది. సార్వత్రిక ఎన్నికలు–2024లో భారీ వేసవి కారణంగా తాగునీటి సౌకర్యాలు, తాత్కాలిక ఛాయా కేంద్రాలు, పనివేళల మార్పు, పాఠశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థల వేళల మార్పు, పార్కులు లేదా పచ్చని ప్రాంతాలను ఉపయోగించడం, అత్యవసర వైద్యం కోసం జిల్లా కలెక్టర్లు తగిన ఏర్పాట్లు చేస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరినవారితో శివ పట్నాయక్

రాయగడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. పార్టీలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారిని సాదరంగా ఆహ్వానిస్తున్నారు. వారి చేరికలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఉద్దేశంతో కండువాలు కప్పుతున్నారు. మంగళవారం స్థానిక సిరిగుడలోని బీజేపీ కార్యాలయంలో 50 మందికి పైగా మహిళలు బీజేపీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ నేతృత్వంలో ఈ చేరికలు జరిగాయి. కొన్ని మహిళా సంఘాలకు చెందిన మహిళలు కూడా పార్టీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు బసంత కుమార్ ఉలక తదితరులు పాల్గొన్నారు.

పొత్తుపై త్వరలో స్పష్టత

- ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ



ఉమ్మర్‌కోట్‌లో టీ తాగుతున్న విజయ్ శర్మ తదితరులు



విజయ్ శర్మకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

కొరాపుట్: ఒడిశా రాష్ట్రంలో బీజేడీ, బీజేపీ పార్టీల పొత్తుపై త్వరలో స్పష్టత వస్తుందని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ప్రకటించారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై తాను మాట్లాడేదేమీ లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశంపై బీజేపీ తరుపున ఉమ్మర్‌కోట్‌లో ప్రచారం చేసేందుకు వచ్చానని తెలియజేశారు. శ్రీరాముని ఆశీర్వాదంతో అయోధ్యలో రామ మందిరం నిర్మాణం పూర్తయ్యిందని పేర్కొన్నారు. మోదీ పాలనలో దేశంలోని అంతర్గత ఉగ్రవాదం నిర్మూలన జరిగిందన్నారు. కేంద్రంలో మరోసారి ఎన్‌డీఏ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. అంతకుముందు విజయ్ శర్మ ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉమ్మర్‌కోట్ పట్టణంలోని స్టేడియంలో దిగారు. మార్గమధ్యలో ఒక టీ స్టాల్ వద్ద టీ తాగి చాయ్ పే చర్చ జరిపారు. అనంతరం ఒక ప్రైవేట్ హోటల్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీకి చెందిన ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో, మాజీ ఎంపీలు పరశురాం మజ్జి, బలభద్ర మజ్జి, నాయకుడు గౌరీ మజ్జి తదితరులు పాల్గొన్నారు.



కోడ్ వర్తించదా..?

ఈ నెల 16వ తేదీ నుంచి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఇంకా చాలాచోట్ల అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. పర్లాకిమిడి జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయం ఆవరణలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు చెందిన వివిధ పథకాల హోర్డింగ్‌లు తొలగించకుండా ఉండడం విమర్శలకు గురవుతోంది. దీంతో కార్యాలయంలో ఉన్న పార్టీ హోర్డింగ్‌లు తొలగించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. – పర్లాకిమిడి

పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటాం

- డీజీపీ అరుణ్ షడంగి



సరిహద్దు రాష్ట్రాలతో డీజీపీ షడంగి సమావేశం

భువనేశ్వర్: లోక్‌సభ, అసెంబ్లీలకు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా ఒడిశా పోలీసులు పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటారని డీజీపీ అరుణ్ షడంగి తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల సీనియర్ అధికారులతో సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం మీడియా ప్రతినిధులతో మంగళవారం ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల మేరకు ఎన్నికల సందర్భంగా సరిహద్దు భద్రతపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రం వెలుపల నుంచి నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, తుపాకుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఒడిశా పోలీసులు సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి జిల్లాల్లో బలగాలను మోహరించారు. సరిహద్దు దాటే అన్ని వాహనాలను పోలీసులు కట్టదిట్టంగా తనిఖీ చేస్తారని తెలిపారు. ఒడిశాలోని మావోయిస్టు ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు సరిహద్దు రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధికారులతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశానికి హాజరైన సరిహద్దు జిల్లాల పోలీసు సూపరింటెండెంట్లు, డీఐజీలతో పాటు ఇంటెలిజెన్స్, ఇతర శాఖల అధికారులు పెండింగ్ వారెంట్‌లను అమలు చేయాలని, సంఘ వ్యతిరేకులను అరెస్టు చేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా అక్రమంగా మాదక ద్రవ్యాలు, నగదు రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం, నకిలీ వార్తల ప్రసారంపై దృష్టి సారించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలపై తప్పుడు సమాచారంపై పట్టు కోల్పోకుండా ఒడిశా పోలీసులకు సోషల్ మీడియా సెల్ ఉందని అరుణ్ షడంగి అన్నారు. అంతేకాకుండా బూటకపు వార్తల ప్రసారం వ్యాప్తి చెందకుండా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాపై ఇన్‌స్పెక్టర్ జనరల్ ర్యాంక్ అధికారి నిఘా ఉంచారని వెల్లడించారు.

క్లుప్తంగా

సేవాభావం అలవరుచుకోవాలి



కలెక్టర్‌కు ఎల్‌ఈడీ లైట్‌లు అందజేస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతిఒక్కరూ సేవాభావం అలవరుచుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లావ్యాప్తంగా మురికివాడల్లో వెలుగులు నింపేందుకు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా 150 ఎల్‌ఈడీ లైట్లు కొనుగోలు చేసి మంగళవారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, క్లబ్ జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, ప్రధాన కార్యదర్శి టి.రాంగోపాల్, సెక్రటరీ శిల్లా మణి తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో ఏర్పాటుచేసిన స్కిల్‌హబ్‌లో సూయింగ్ మెషీన్ ఆపరేటర్ (టైలరింగ్)లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్ మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు అందించే టైలరింగ్ స్వల్పకాలిక కోర్సు శిక్షణకు 5వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 23తో దరఖాస్తుల గడువు ముగుస్తుందన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు బయేడేటా, విద్యార్హతలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో బలగ హాస్పటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 70957 31303 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.


27 నుంచి జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సుమిత్రా కళాసమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి 30 వరకు జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సుమిత్రా కళా సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. నగరంలోని అవోపా కల్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా జాతీయ ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గురజాడ అప్పారావు రచించిన 125 ఏళ్లనాటి కన్యాశుల్కం నాటకాన్ని ఈ నెల 27న ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ నాటకానికి టికెట్ రుసుం రూ.50గా నిర్ణయించామన్నారు. నాటకం అనంతరం కళాకారులకు అభినందన సత్కారాలు ఉంటాయన్నారు. 28న కొలకలూరు, సాయిఆర్ట్స్ వారిచే 'కౌసల్యా సుప్రజా రామా' నాటిక, కాకినాడ, సాయి కార్తీక్ క్రియేషన్స్ వారి 'ఎడారిలో వాన చినుకు' నాటికలు ప్రదర్శిస్తామని తెలిపారు. 29న హైదరాబాద్‌కు చెందిన గోవాడా క్రియేషన్స్ వారిచే 'మూల్యం' నాటిక, కాకినాడ శృంగార వల్లభ ఆర్ట్స్ వారిచే 'కబ్జా' నాటిక, 30న గుంటూరు వారి అభియన ఆర్ట్స్ వారిచే 'ఇంద్రప్రస్థం' నాటిక, కొప్పోలుకు చెందిన పండు క్రియేషన్స్ వారిచే 'పక్కింటి మొగుడు' నాటిక ప్రదర్శన జరుగుతాయని చెప్పారు. సమావేశంలో సమితి కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, యు.పూజ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



బాలుకు చెక్ అందిస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాసకు చెందిన కిల్లంశెట్టి పార్వతి అనారోగ్యం బారిన పడటంతో శ్రీకాకుళంలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. హెల్త్‌కార్డు సైతం రిజెక్టు కావడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 10న మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి రూ.లక్షా యాభై వేలు తగ్గించేలా చేశారు. దీంతో పాటు, రూ.85 వేల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. ఈ చెక్‌ను మంగళవారం పార్వతి కుమారుడు బాలుకు అందించారు.



పిచ్చుకలు



పిచ్చుకల సంరక్షణపై గూళ్లతో అవగాహన కల్పిస్తున్న రజేంద్ర సాహు



ఆవాసాల మధ్యలో వెలసిన సెల్ టవర్లు

మాయమైపోతున్నయమ్మా..!

- కనుమరుగవుతున్న పిచ్చుకలు
- రేడియేషన్ ప్రభావంతో అంతరించిపోతున్న జాతి
- నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



కళా నైపుణ్యంతో గాజు గ్లాసుపై పిచ్చుకల దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతున్న సైకత శిల్పి సత్య మహారణ



వేలాడదీసిన వరిచేలు తింటున్న పిచ్చుకలు





కృత్రిమ గూటిలో పిల్లలకు ఆహారాన్ని అందిస్తున్న పిచ్చుక

బరంపురం: గ్రామాల్లోని పూరింటి గడపల్లో, పశువుల పాకల్లో కనువిందు చేసే పిచ్చుకలు ప్రస్తుతం కనిపించడం లేదు. ఎక్కడబడితే వాటి కిచకిచ ధ్వనులు వినిపించడం మాయమైపోయింది. దీంతో మరి కొన్నేళ్ల తర్వాత పిచ్చుక జాతి అంతరించిపోతుందని పర్యావరణ, జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ల వలన వస్తున్న రేడియేషన్, కనుమరుగైన పూరిళ్లు, కలుషిత వాతావరణమే పిచ్చుకల సంఖ్య తగ్గడానికి కారణమని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. అప్పట్లో వ్యవసాయ కుటుంబాల్లో వరిచేలు తీసుకొచ్చి ఇంటి గుమ్మాలకు వేలాడదీసి ఉంచేవారు. వీటిని తినేందుకు పిచ్చుకలు వచ్చి కిచకిచమంటూ ఆనందాన్ని అందించేవి. అలాగే ఉదయం వాకిలిలో పిండితో ముగ్గులు వేసేవారు. వాకిట్లో వేసిన ముగ్గు పిండిని తినేందుకు పిచ్చుకలు వచ్చేవి. అయితే ఆధునికత పెరిగి క్రమేపీ సాంప్రదాయాలు కనుమరుగవ్వడంతో పిచ్చుకల మనుగడ కష్టతరంగా మారింది. దీంతో ప్రతిఏటా పిచ్చుకలను సంరక్షించే ఉద్దేశంతో మార్చి 20వ తేదీన ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మొదటిసారిగా 1990లో ఈ జాతుల సంఖ్య తగ్గిపోవడాన్ని అర్నిథాలజిస్టులు కనుగొన్నారు. అప్పటినుంచి ఈ జాతి పక్షులు తగ్గిపోకుండా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి.

పిచ్చుకల రక్షణకు కృషి

గంజాం జిల్లాలో పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా ఎక్కడ చూసినా సెల్ టవర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. దీంతో పిచ్చుకల రక్షణ కోసం ప్రత్యేకంగా చెక్క కలపలతో గూడ్లు తయారు చేసి అతి తక్కువ ధరకు విక్రయిస్తున్నాను. వీటిని ఇంటి ముందు తగిలించి బియ్యపు నూకలు వేస్తే తప్పనిసరిగా పిచ్చుకలు వాలుతాయి. ఇప్పటికే గంజాం, పూరీ, భువనేశ్వర్, సంబల్‌పూర్, రౌర్కెలా, మల్కన్‌గిరి, పారాదీప్, గోపాల్‌పూర్ జిల్లాలకు చెందిన అనేకమంది గూడ్లను తీసుకెళ్లికి పిచ్చుకలకు రక్షణ కల్పిస్తున్నారు.

–రబీంద్రా కుమార్ సాహు,
రూసికుల్యా సముద్ర ఆలీవ్ రీడ్ సంరక్షణ సంస్థ అధ్యక్షుడు

డోలోత్సవం ప్రారంభం



చచేరి అలంకారంలో దేవతామూర్తులు

భువనేశ్వర్: పవిత్ర ఫగు దశమిని పురస్కరించుకుని పూరీలోని జగన్నాథ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమందిరంలో ఫాల్గుణ శుక్ల పక్షం దశమి తిథిని ఫగ్గు దశమిగా వ్యవహరిస్తారు. ఈ తిథి నుంచి శ్రీజగన్నాథుని దేవస్థానంలో డోలోత్సవం ప్రారంభం అవుతుంది. పూర్ణిమ వరకు ఆరు రోజుల పాటు నిరవధికంగా జరిగే డోలోత్సవం డోలో పూర్ణిమ వేడుకలతో ముగుస్తుంది. శ్రీజగన్నాథుని ద్వాదశ యాత్రలో డోలోత్సవం ఒక ప్రధాన ఉత్సవంగా నిర్వహించడం విశేషం. ఈ ఉత్సవంలో శ్రీజగన్నాథుని ప్రతినిధిగా డోలగోవింద ఉత్సవమూర్తితో డోలోత్సవం ఆనందోత్సాహాలతో నిర్వహిస్తారు. నిత్యం డోలగోవింద స్వామిని డోలికలో ఊరేగింపుగా శ్రీజగన్నాథ్ వల్లభ్ మఠం ప్రాంగణానికి చేరవేస్తారు. ఈ ప్రాంగణంలో డోల వేదిక వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాధాకృష్ణుల ప్రేమకు ప్రతీకగా సుగంధ భరిత రంగు పొడి (ఫగ్గు) విరజిమ్ముతూ డోలికలో నిర్వహించే ఊరేగింపులో భక్తులు అత్యంత ఆనందోత్సాహాలతో పాలుపంచుకుంటారు. ఈ సందర్భంగా ఫాల్గుణ శుక్ల పక్షం దశమి నుంచి పూర్ణిమ ముందు రోజు రాత్రి వరకు శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులకు చచేరి అలంకరణ చేస్తారు. ఈ అలంకరణలో నీలిరంగు పట్టు వస్త్రాలు వినియోగిస్తారు. ఈ వ్యవధిలో దేవతామూర్తులకు నివేదించే నైవేద్యం చచేరి భోగంగా ప్రతీతి. దశమి నుంచి శ్రీ క్షేత్రానికి భక్తుల రద్దీ క్రమంగా పుంజుకుని పూర్ణిమ నాటికి ఉత్సవ తాకిడి పుంజుకుంటుంది.

కొలిక్కిరాని పొత్తు వ్యవహారం



భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేపీ, బీజేడీ కూటమి వ్యవహారం కొలిక్కి రావడం లేదు. ఈ విషయంలో అనిశ్చితి కొనసాగుతునే ఉంది. ఈ రెండు పార్టీలు తమ అభ్యర్థుల జాబితాని ఇంతవరకు ప్రకటించకపోవడంతో ఈ సందిగ్ధత నెలకొంది. ప్రధానంగా బీజేపీ నాయకులు ఇటీవల కాలంలో తరచూ ఢిల్లీ వెళ్లి కేంద్ర నాయకులతో చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ వైఖరిలో కూటమి విషయంలో తొలి నుంచి వ్యతిరేకత నిలకడగా కొనసాగుతోంది. ఇప్పటికీ ఇదే వైఖరిని పరోక్షంగా బహిరంగపరుస్తున్నారు. రాష్ట్రంలో 147 విధాన సభ స్థానాలు, 21 లోక్‌సభ స్థానాల్లో పోటీకి సర్వం సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ, బీజేడీ పొత్తుపై అధిష్టానానిదే తుది నిర్ణయమని బీజేపీకి చెందిన భవానీపట్న ఎమ్మెల్యే ప్రదీప్త కుమార్ నాయక్ మంగళవారం పునరుద్ఘాటించారు. అయితే రాష్ట్రంలో అన్ని స్థానాల్లోనూ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే సుందర్‌గఢ్ లోక్‌సభ సభ్యుడు జుయెల్ ఓరం మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తల్లో పొత్తుపై ఎలాంటి గందరగోళం లేదన్నారు. రాష్ట్రంలో పోరాడేందుకు కేంద్ర నాయకత్వానికి ప్రతిపాదిత అభ్యర్థుల జాబితా పంపామని, వారి నిర్ణయం మేరకు అన్నీ జరుగుతాయని తెలిపారు.

ఢిల్లీకి సామల్

మే 13, 20, 25, జూన్ 1 తేదీల్లో నాలుగు దశల్లో ఒడిశాలో జరగనున్న లోక్‌సభ, విధాన సభ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ సోమవారం న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థ) మానస్ మహంతి, ఒడిశా ఎన్నికల కో–ఇన్‌చార్జులు విజయ్ పాల్ సింగ్ తోమర్, లతా ఉసెండి ఆయనతో ఉన్నారు. ఇంతవరకు వీరి నుంచి ఎటువంటి సమాచారం అందకపోవడంతో పొత్తు వ్యవహారం ఇంకా ఊగిసలాడుతోందని భావిస్తున్నారు. పొత్తు అనిశ్చితి పురస్కరించుకుని కేంద్ర నాయకులతో సంప్రదింపుల కోసం 2 వారాల్లోపే 3 సార్లు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఢిల్లీ వెళ్లడం విశేషం.

ప్రారంభమైన నీలావడి జాతర



ఘటాల వద్ద భక్తుల సందడి

రాయగడ: భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లి నీలావడిలో వెలసిన అగ్ని గంగమ్మ జాతర సోమవారం సాయంత్రం నుంచి ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలను ప్రత్యేక మండపంలో భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటలకు అమ్మవారిని ఆహ్వానించే కార్యక్రమంతో జాతరకు శ్రీకారం చుట్టారు. ఈనెల 27వ తేదీ వరకు కొనసాగే అమ్మవారి జాతరలో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ఘటాలను ఊరేగిస్తారు. దీనినే అమ్మవారి నగర పరిక్రమగా పిలుస్తారు.

సాంప్రదాయబద్ధంగా అమ్మవారి విధివిధానాలను, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

హెచ్‌ఎం సస్పెన్షన్



హెచ్‌ఎం సంతోష్ కుమార్ సాహు

రాయగడ: సదరు సమితి టెంటాలిగుడ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న సంతోష్ కుమార్ పాత్రోపై సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ నాయక్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. అతడు ప్రతిరోజూ తాగి పాఠశాలకు వస్తున్నట్లు విద్యార్థులు, గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు దర్యాప్తు చేపట్టి సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు.

దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష

సోంపేట : దాడి కేసులో సోంపేట పట్టణానికి చెందిన నర్తు జోగారావుకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ శ్రీకాకుళం జిల్లా 4వ అదనపు న్యాయమూర్తి (ఎస్సీ, ఎస్టీ) ఎస్.ఎం.ఫణికుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. పట్టణంలోని జలంత్ర జాలరీ వీధిలో నివసిస్తున్న పట్ట బాలరాజుతో పెయింటింగ్ కాంట్రాక్ట్ విషయంలో జరిగిన గొడవలో 2017 నవంబర్ 18న జోగారావు కత్తితో దాడి చేశాడు. అప్పట్లో కేసు నమోదు కాగా.. నేరం రుజువు కావడంతో తీర్పు వెల్లడైంది.

అర్ధరాత్రి వాహన తనిఖీలు



అర్ధరాత్రి సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. టెక్కలి పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు వాహన తనిఖీలు చేశారు. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద ఏఎస్ఐ కేశవరావు ఆధ్వర్యంలో సుమారు 20 మంది ఆర్‌ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు వచ్చిపోయే వాహనాలను నిశితంగా పరిశీలించారు.

11 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

బరంపురం: గంజాం జిల్లాలో కొద్ది రోజుల నుంచి రహస్యంగా నడుస్తున్న రెండు వేర్వేరు జూదం అడ్డాలపై పోలీసులు దాడులు చేసి 11 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఎస్‌డీపీవో పాణి తెలిపిన వివరాల మేరకు.. గోపాల్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి డొరా గ్రామంలోని ఒక ఇంటిలో రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై దాడిచేసి, 7 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.19,200 నగదు, 7 సెల్‌ఫోన్లు, 2 పేకముక్కల కట్టలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే జరడా పోలీసుస్టేషన్ పరిధి సింహాలి గ్రామంలోని మామిడి తోటలో రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై దాడిచేసి, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.14,330 నగదు, 3 సెల్‌ఫోన్లు, 1 పేకముక్కల కట్ట స్వాధీనం చేసుకున్నారు.

ఆరుగురు దొంగలు అరెస్టు



అరెస్టైన దోపిడీ దొంగలు

బరంపురం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఐదు దోపిడీ ఘటనలకు సంబంధించి ఆరుగురు దోపిడీ దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్పీ సార్వణ్ వివేక్ తెలియజేశారు. గోళంతర పోలీసుస్టేషన్ పరిధిలోని నాలుగు ప్రాంతాలు, గోపాల్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి నారాయణపూర్ గ్రామంలో జరిగిన ఒక దోపిడీ ఘటనలకు సంబంధించి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 15 గ్రాముల బంగారం, 3 సెల్‌ఫోన్లు, కేబుల్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో రళవ గ్రామనికి చెందిన పి.రాహుల్ పాత్రో, డి.బల్లు పాత్రో, డి.నరసింహా పాత్రో, పి.కూర్మయ్య పాత్రో, చంద్రయ్య పాత్రో, పి.అజిత్ పాత్రోలు ఉన్నట్లు నిర్ధారించారు.

వంతెనపై అదుపుతప్పిన వ్యాన్



జయపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాదస్థలంలో క్షతగాత్రులు



వంతెనపై నుంచి జారిపడిన వ్యాన్

- ఇద్దరు మృతి, పది మందికి తీవ్రగాయాలు

జయపురం: సబ్ డివిజన్ కుంద్రా సమితి భుషంగగుడ పంచాయతీ ఖటలపాదర్ గ్రామం వద్ద కొలాబ్ వంతెనపై అదుపు తప్పి వ్యాన్ జారిపడిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, 10 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారు బొయిపరిగుడ సమితి మాలగుడ గ్రామానికి చెందిన సుతి బలియ(62), కుపిలిగుడ గ్రామానికి చెందిన విద్యార్థిని లక్ష్మీ రామపురియలుగా గుర్తించారు. స్థానికులు క్షతగాత్రులను కుంద్ర ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారిని జయపురం జిల్లా కేంద్ర కేంద్ర ఆస్పత్రికి పంపించారు. వారిలో విషమంగా ఉన్న ఆరుగురిని కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు.

ఇదీ విషయం...

బొయిపరిగుడ సమితి దలపూర్‌కు చెందిన ఒక యువతికి బొరిగుమ్మ సమితి నువాగాం పంచాయతీ డుడుసపల్లి గ్రామానికి చెందిన వరుడితో శనివారం పెళ్లి జరిగింది. వరుడి కుటుంబం ఆహ్వానం మేరకు వధువు బంధువులు దలపూర్, మాలగుడ, కుపిలగుడ, పిపాగుడ గ్రామాల నుంచి దాదాపు 45 మంది వ్యాన్‌లో డుడుసపల్లికి వెళ్లి విందులో పాల్గొన్నారు. అనంతరం తిరిగి వస్తుండగా ఖటలపాదర్ గ్రామం వద్ద కొలాబ్ వంతెనపై అదుపుతప్పి జారిపడింది. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా అనేక మంది గాయపడ్డారు. ఈ విషయం తెలిసిన వెంటనే జిల్లా స్వతంత్ర పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర మఝి, కోట్‌పాడ్ బీజేడీ పర్యవేక్షకుడు సూర్యనారాయణ రథ్ తదితరులు క్షతగాత్రులు, మరణించిన వారి కుటుంబాలను ఓదార్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలాపాపారావు, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

స్టిక్కర్ల తొలగింపు



స్టిక్కర్లు తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న సెక్టార్ అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస రావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలోని 41, 42, 43 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇళ్లకు అతికించిన రాజకీయ నాయకుల స్టిక్కర్లు, పోస్టర్లను ఎన్నికల సిబ్బంది మంగళవారం తొలగించారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలుచేస్తున్నట్టు సెక్టార్ అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు.

రెండో రోజు 99.24శాతం హాజరు



పార్వతీపురం పట్టణంలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కె.ఆనందరావు

పార్వతీపురం టౌన్: పదో తరగతి పరీక్షల్లో రెండవ రోజు 99.24 శాతం హాజరు నమోదైనట్లు డీఈఓ జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 66 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 10,550 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,470మంది హాజరైనట్లు తెలిపారు. 29మంది ప్రత్యేక స్క్వాడ్ సిబ్బంది పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేశారని స్పష్టం చేశారు.

వైద్యశాఖ గ్రీవెన్స్‌కు 20 వినతులు



ఉద్యోగుల నుంచి వినతులు తీసుకుంటున్న డీఎం హెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో ఉద్యోగుల గ్రీవెన్స్‌సెల్‌ను మంగళవారం నిర్వహించారు. జిల్లా పరిధిలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలకు సంబంధించిన సమస్యలపై వైద్య ఆరోగ్య కార్యాలయంలో మొత్తం 20అర్జీలను ఉద్యోగుల నుంచి ఈ సందర్భంగా ఆయన స్వీకరించారు. వాటిపై పరిశీలన చేసి, చర్చించి తగు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు డీఎంహెచ్ఓ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా.రఘుకుమార్, సీనియర్ సహాయకుడు చిరంజీవి పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు జాబ్ కార్డులు

- ఉపాధిహామీ పనికల్పన

విజయనగరం ఫోర్ట్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో ఇంతవరకు సాధారణ ప్రజలు, దివ్యాంగులకు మాత్రమే పని కల్పించేవారు. తాజాగా, ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా ఉపాధి పనులు కల్పించనున్నారు. దీనికోసం వారికి అధికారులు జాబ్‌కార్డులు మంజూరు చేస్తున్నారు. పనికావాలని కోరే ప్రతీ ట్రాన్స్‌జెండర్‌ను ఒక కుటుంబంగా గుర్తించి ప్రత్యేక జాబ్‌కార్డు ఇస్తారు. ఏదైనా గ్రామ పంచాయితీలో ఐదుగురు కంటే ఎక్కువ ట్రాన్స్‌జెండర్స్ ఉంటే వారిని ప్రత్యేక శ్రమశక్తి సంఘాలుగా ఏర్పాటు చేసి పనికల్పిస్తారు. అందరికీ పనికల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలను అమలుచేస్తున్నట్టు ఉపాధిహామీ పథక అధికారులు తెలిపారు.

పైడితల్లి పాహిమాం!



తల్లీ కరుణించు..

- పోలిపల్లి పైడితల్లి జాతరకు పోటెత్తిన భక్తులు
- సేవల్లో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం కనుల పండువగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ జాతరకు మూడో రోజు మంగళవారం తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. అమ్మవారి ఆలయం వద్ద వేపచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వెనుక భాగంలో పలువురు తలనీలాలు సమర్పించారు. భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు సేవలందించాయి. మంచినీరు, మజ్జిగ, అల్పాహారం, పులిహోర ప్యాకెట్లను పంపిణీచేశాయి. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, వాసవీక్లబ్ మన రాజాం–సారథి, సత్యసాయి సేవాదళ్ తదితర స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశాయి.



అమ్మవారి వేపచెట్టు వద్ద భక్తుల తొలిపూజ

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు....

పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర ఏర్పాట్లపై ఈఓ మాధవరావుతో పాటు సీఐ మోహనరావును అడిగి తెలుసుకున్నారు.

జాతర ముగింపు ఇలా...

ఆలయం వద్ద శుక్రవారం జరిగిన నేత్రోత్సవం అనంతరం అమ్మవారి గర్భగుడి నుంచి తీసుకువెళ్లిన ప్రతిమలను మంగళవారం అర్ధరాత్రి తిరిగి ఆలయానికి చేర్చడంతో జాతర ముగుస్తుంది. కొండంపేటలోని లంకలపల్లి కుటుంబీకుల ఇంటి వద్ద నుంచి ఘటాలతో అమ్మవారి గుడికి చేరుకోవడంతో జాతర ముగుస్తుంది. దీనిని పురస్కరించుకొని అర్ధరాత్రి సమయంలో కనులు మిరుమిట్లు గొలిపే బాణాసంచా భక్తులను ఆకట్టుకుంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.



అమ్మవారి జాతరలో సేవలందించేందుకు వచ్చిన స్కౌట్ క్యాడెట్లు

కాదేదీ చోరీకి అనర్హం..!

- శ్మశాన వాటికలో దొంగతన

నెల్లిమర్ల: జరజాపుపేట శ్మశాన వాటికలో దొంగతనం జరిగింది. ఈ మేరకు స్థానిక శ్మశాన వాటికలో దుండగులు బీడుతో కూడిన దహన వాటికను ధ్వంసం చేసి మంగళవారం పట్టుకెళ్తున్న సమయంలో ఎవరో కేకలు వేయడంతో దహనవాటిక శిథిలాలను అక్కడే వదిలి దుండగులు పలాయనం చిత్తగించారు. ఇటీవల శ్మశానం అభివృద్ధి చేయడానికి దాతలు ముందుకు వచ్చి లక్షలాది రూపాయలతో ప్రహరీ, దహనవాటిక ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో దుండగులు బీడు దహనవాటిక లక్షలు విలువ చేయడంతో దానిమీద కన్నేసి సోమవారం అర్ధరాత్రి తర్వాత దహనవాటికను ముక్కలు చేసి తీసుకువెళ్తున్న సమయంలో పొలం పనులకు వెళ్లేవారు శబ్దాలు వినిపించి పెద్ద కేకలు వేయడంతో వాటిని వదిలేసి పారిపోయారు. ఇదిలా ఉండగా ఇంటిలో డబ్బు, నగదు దొంగతనం చేయడం చూశాం. కానీ శ్మశాన వాటికలో దొంగతనం ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికలో దొంగతనంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెబుతున్నారు.



దహనవాటికను ముక్కలు చేసిన దుండగులు

యువకుడి హత్య ?

- రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా యువకుడి మృతదేహం





రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న శేఖర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్సై రవివర్మ (ఇన్‌సెట్లో) పూర్ణ చంద్రశేఖర్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడి మృత దేహం కనిపించడంతో అది హత్యా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ సంఘటనకు సంబంధించి జీఆర్‌పీ సిబ్బంది, బాధిత కుటుంబసభ్యులు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోరుకొండ పాలెం గ్రామానికి చెందిన పి.పూర్ణ చంద్రశేఖర్ (25) విశాఖ జిల్లా తగరపువలస మండలం గుడివాడ గ్రామంలో కేటరింగ్ పనులకు వెళ్తుంటాడు. ఈ నెల 18న రాత్రి కోరుకొండపాలెం ఇంటికి వచ్చాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో యల్లారమ్మ పండగకు వెళ్లాడు. 19న ఉదయం ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే అర్ధరాత్రి సమయంలో తగాదాలు జరిగినట్లు తెలిసిందని, అనంతరం కోరుకొండ గ్రామంలో రైల్వేట్రాక్‌పై శేఖర్ మృతదేహం లభ్యమైందని కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమారుడి మృతిపై పలు అనుమానాలున్నాయని, కొంతమంది కుమారుడిని చంపి రైల్వే ట్రాక్‌పై పడేసి ఉంటారని మృతుని తల్లి రమణమ్మ అనుమానం వ్యక్తం చేసింది, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ తెలిపారు.

పిడుగుపాటుతో ఇద్దరికి గాయాలు

గుర్ల: మండలంలోని తెట్టంగి, గూడెం సమీపంలో గేదెల కాపరుల సమీపంలో మంగళవారం పిడుగు పడడంతో పాలాయవలస గ్రామానికి చెందిన ద్వారాపురెడ్డి సత్యనారాయణ, గూడెం గ్రామానికి చెందిన తోట బంగారయ్యకు గాయాలయ్యాయి. దీంతో వారిద్దరిని గుర్ల పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని బాధితుల కుటుంబసభ్యులు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మక్కువ: మండలంలోని డి.శిర్లాం గ్రామం సమీపంలో గోముఖి, సువర్ణముఖి నదుల కలిసిన ప్రదేశంలోని ప్రభుత్వం గుర్తించిన ఇసుకరీచ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎస్సై పి.నరసింహమూర్తి మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇసుకరీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని, సమాచారం అందడంతో, సిబ్బంది వెళ్లి పరిశీలించగా, రీచ్‌వద్ద ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి పట్టుకుని, స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే, పట్టుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పూసపాటి రేగలో మరొకటి..

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల చంపావతినది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా అనుమతిలేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై నిఘావేసి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు చెప్పారు. అనుమతిలేకుండా ఇసుక తరలిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

22 నుంచి డీఈఎల్ఈడీ సెమిస్టర్ పరీక్షలు

విజయనగరం అర్బన్: టీచర్ శిక్షణ కోర్సు (డీఈఎల్ఈడీ)లకు సెమిసర్ట్ పరీక్షలు ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తామని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–24 ఫ్రెషర్స్, ఇంతకుముందే మూడో సెమిస్టర్ ఫెయిలైన విద్యార్థులకు సబ్జెక్టు వారీగా ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. 2023–25 బ్యాచ్‌తో పాటు మొదటి సెమిస్టర్ ఫెయిలైన వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షల టైమ్ టేబుల్, ఇతర వివరాల కోసం 'బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్ సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సామాన్యులకూ ఎన్నికల కోడ్



పార్వతీపురం: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులకు మాత్రమే కాకుండా సామాన్యులు కూడా కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. నిష్పక్షపాత ఎన్నికల కోసం ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తుంది. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను తప్పనిసరిగా పాటించాలి. లేదంటే కోరి చిక్కులు తెచ్చుకున్నట్లే అని అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఎన్నికల కోడ్ అంటే రాజకీయనాయకులకే కదా మనకేం ఇబ్బందని అంతా అనుకుంటారు. కానీ కొన్నిసార్లు సామాన్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. తప్పు చేయకపోయినా అధికారులకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల కోడ్ వల్ల నగదు రవాణాపై ఆంక్షలు ఎక్కువగా ఉంటాయి. చెక్‌పోస్టులవద్ద తనిఖీలు చేసిన సమయంలో సామాన్యులు ఎవరైనా నగదును తరలిస్తున్నప్పుడు సరైన పత్రాలు లేకపోతే ఎవరి డబ్బైనా అధికారులు స్వాధీనం చేసుకుంటారు.

రూ.50వేలకు మించితే వివరణ ఇవ్వాలి

రూ.50వేల కన్నా ఎక్కువ నగదును సామాన్యులు తరలిస్తే పూర్తిగా వివరణ ఇవ్వాలి. ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చింది? ఎలా వచ్చింది? ఎక్కడికి తీసుకుని వెళ్తున్నారు. తదితర విషయాలు చెప్పాల్సి ఉంటుంది. మీ సమాధానంలో తేడా ఉన్నా చెప్పిన దానిలో వాస్తవం లేకపోయినా ఆ నగదును అధికారులు స్వాధీనం చేసుకుంటారు. సరైన పత్రాలు చూపించాకే మీ నగదు మీకు తిరిగి అప్పగిస్తారు. అంతవరకు మీ నగదు కోర్టు కస్టడీలో ఉంటుంది. ఎన్నికల కౌంటింగ్ అయ్యేంతవరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. నగదే కాకుండా బంగారం, వెండి తదితర ఆభరణాలు, విలువైన వస్తువులు ఏవైనా సరే అనుమానం వస్తే అధికారులు స్వాధీనం చేసుకుం టారు. బంగారం, వెండి తదితర వర్తకులు సైతం తగిన పత్రాలు పట్టుకునే ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. లేదంటే చిక్కులు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు.

చోరీ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

- మిగిలిన నిందితుల కోసం గాలింపు
- గత నెల 26న ఖడ్గవలస జంక్షన్ సమీపంలో చోరీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం టౌన్: గరుగుబిల్లి మండలం సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస జంక్షన్ సమీపంలోని ఇంట్లో జరిగిన చోరీ కేసులో ప్రధాన నిందితుడిని అరెసు చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గత నెల 26న వేకువజాము సుమారు 5 గంటల సమయంలో ఖడ్గవలస జంక్షన్‌లో నివసిస్తున్న కిమిడి శ్రీరామమూర్తి ఇంటిలో నలుగురు దుండగులు ప్రవేశించి శ్రీరామమూర్తిని, ఆయన భార్య భాగ్యరత్నం కాళ్లుచేతులు కట్టి నోటికి ప్లాస్టర్స్ వేసి సినీ ఫక్కీలో దొంగతనం చేశారన్నారు. బీరువా తాళాలు తెరిచి సుమారు 87.5 తులాల బంగారాన్ని దోచుకుపోయారని చెప్పారు. దీంతో బాధితుడు కిమిడి శ్రీరామమూర్తి ఫిర్యాదు మేరకు గరుగుబిల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని చెప్పారు. ఈ కేసు దర్యాప్తు కోసం నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గరుగుబిల్లికి చెందిన ఒకరు, తూర్పుగోదావరికి చెందిన ఒకరు. బొబ్బిలికి చెందిన ఒకరు, ఈ నేరానికి పథకం రచించి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను తెప్పించి ఆ ఇంట్లో దొంగతనానికి పాల్పడినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చామని ఎస్పీ తెలిపారు. దర్యాప్తులో భాగంగా నిందితుల ఆచూకీ కనిపెట్టి ప్రధాన నిందితుడైన బొబ్బిలి మండలంలోని అప్పయ్య పేట గ్రామానికి శంకరావును బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ దరి రాజా కాలేజీ గ్రౌండ్‌లో పోలీసుబృందాలు అదుపులోకి తీసుకున్నాయన్నారు. నిందితుడి దగ్గర నుంచి చోరీకి గురైన బంగారంలో భాగమైన 18.87 తులాల స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ప్రధాన నిందితుడు ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ దొంగతనంలో పాల్గొన్న బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను, గరుగుబిల్లికి చెందిన ఒకరిని, తూర్పు గోదావరికి చెందిన ఒకరిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.

ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు

ఈ కేసులో దర్యాప్తు బృందాలుగా పాల్గొన్న పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, పార్వతీపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.మంగరాజు, సీసీఎస్ సీఐ ఎం. అప్పారావు, ట్రైనీ డీఎస్పీ మహమ్మద్ అజీజ్, గరుగుబిల్లి ఎస్సై వై.అమ్మాన్ రావు, పార్వతీపురం టౌన్ ఎస్సై రవీంద్ర రాజు, సీసీఎస్ ఎస్సై కళాధర్, పార్వతీపురం రూరల్ ఎస్సై పి.దినకర్, బలిజిపేట ఎస్సై పాపారావు, జియ్యమ్మవలస ఎస్సై అనీష్, పార్వతీపురం టౌన్ హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్, సీసీఎస్ కానిస్టేబుల్ ఉదయ్, గరుగుబిల్లి కానిస్టేబుల్ అచ్యుత్, ఐటీ కోర్ కానిస్టేబుల్ అనిల్‌లను, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించి రివార్డులు అందజేశారు.

ఘనంగా శంబర పోలమాంబ జాతర



శంబర పోలమాంబ అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి తొమ్మిదివ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామునుంచి భక్తులు గ్రామానికి చేరుకుని చదురుగుడిలో కొలువైన పోలమాంబను దర్శించుకున్నారు. అనంతరం వనంగుడిలో పెదపోలమాంబ అమ్మవారిని దర్శించుకుని, ఆలయం వెనుకన ఉన్న వేపచెట్టుకు పసుపు, కుంకమలతో పూజలు చేశారు. ఆలయం వద్ద కోళ్లు, చీరలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో వి.వి.సూర్యనారాయణ చర్యలు చేపట్టారు.

రెండు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

- జేఎన్‌టీయూ జీవీ, లెండి కళాశాలల గుర్తింపు
- అధికారులతో కలిసి ఆయా కళాశాలల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



జొన్నాడలోని లెండీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: జిల్లాలో జూన్ 4న జరగనున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రెండు కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. నగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) విశ్వవిద్యాలయ క్యాంపస్, జొన్నాడలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈ మేరకు ఆయా కేంద్రాల్లోని ఏర్పాట్లును ఎస్పీ ఎం.దీపిక, జేసీ కె.కార్తీక్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశాల్లో చర్చించిన మీదట సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాటు, ఓట్ల లెక్కింపును జేఎన్‌టీయూ జీవీ, లెండి కళాశాలల్లో నిర్వహించాలని నిర్ణయానికి వచ్చామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట్ త్రివినాగ్, డీఆర్ఓ ఎస్.డి.అనిత, ఆర్డీఓలు ఎం.వి.సూర్యకళ, సాయిశ్రీ, బి.శాంతి, రిటర్నింగ్ అధికారులు నూకరాజు, జోసఫ్, మురళీకృష్ణ, డీఎస్పీ గోవిందరావు, విజయనగరం తహసీల్దార్ రత్నం, పోలీస్ అధికారులు, పలు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతిపక్షాల కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కుటుంబాలు

- పార్టీ తీర్థం పుచ్చుకున్న 14వ డివిజన్‌కు చెందిన 52 కుటుంబాలు
- కండువాలు వేసి ఆహ్వానించిన కోలగట్ల తమ్మన్నశెట్టి, మన్యాల కృష్ణ

విజయనగరం: రానున్న ఎన్నికల్లో శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్ర స్వామిని గెలిపించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమ్మన్న శెట్టి, జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్యాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం విజయనగరంలోని 14వ డివిజన్‌లో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 52 కుటుంబాల వారు కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకటరాజేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో నూతనంగా చేరిన వారికి తమ్మన్నశెట్టి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో 14వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల ధరల పెంపు

- జీసీసీ డీఎం మహేంద్రకుమార్



సిబ్బందితో మాట్లాడుతున్న జీసీసీ డీఎం మహేంద్ర కుమార్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం జీసీసీ పరిధిలో కొనుగోలు చేస్తున్న అటవీ ఉత్పత్తుల ధరలు పెంచినట్లు జీసీసీ డీఎం మహేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక జీసీసీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాక్‌బీ తేనె రూ.200 నుంచి రూ.250వరకు, ముషిడి పిక్కలు కేజీ రూ.70 నుంచి రూ. 90కి పెంచినట్లు తెలిపారు. దీనిని గిరిజన రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. కుంకుడుకాయలు బాగా ఆరిన, ముదిరినవి కేజీ ధర రూ.35 చేసినట్లు చెప్పారు. చింతపండు దిగుబడి ఈ ఏడాది అంత ఆశాజనకంగా లేదని, దాని వల్ల గిరిజన రైతులకు ఆర్థికంగా కొంత ఇబ్బంది కలిగిందని, ప్రస్తుత సీజన్‌లో దొరికే ఉసిరి పప్పు రూ.80, కుంకుడు కాయలు, కొండచీపుళ్లు, ముషిడి పిక్కలు సేకరించి దాని ద్వారా ఆదాయం పొందవచ్చని సూచించారు.

రూ.25లక్షలు రుణాలు మంజూరు

గతేడాది రూ. 25లక్షలు గిరిజన రుణాలు మంజూరు చేశామని, ఈనెలాఖరుకు మొత్తం రికవరీ చేస్తామని జీసీసీ డీఎం తెలిపారు. అటవీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు రూ.9.20కోట్ల టార్గెట్ కాగా ఇప్పటి వరకు రూ. 12కోట్ల వరకు కొనుగోలు చేశామని తెలిపారు. ఏటా [illegible] మద్దతు ధర ప్రకారం చెల్లించే విధంగా ఈ ఏడాది కూడా చెల్లిస్తున్నామని తెలిపారు.



విజయనగరం కోట ప్రాంతంలో జోరువాన

జోరువాన

- చల్లబడిన వాతావరణం
- మొక్కజొన్న, నువ్వు పంటలకు నష్టం
- చీపురుపల్లిలో 86.8 మి.మీ
- వేసవి పంటల సాగుకు అనుకూలం

రాజాం/ఎస్.కోట/గజపతినగరం/సంతకవిటి/రేగిడి/చీపురుపల్లి: విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్నిచోట్ల భారీ వర్షం కురవగా, మరికొన్నిచోట్ల చిరుజల్లులు పలుకరించాయి.

- చీపురుపల్లిలో 86.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈదురుగాలులకు శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతరలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణ బోర్డులు నేలకూలడంతో ఓ చికెన్ దుకాణం ధ్వంసమైంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ల సూచనలు మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, గవిడి సురేష్ తదితరులు దగ్గరుండి విద్యుత్ దీపాల అలంకరణ పునరుద్ధరణ పనులు చేపట్టారు. జేసీబీతో హోర్డింగ్‌లు తొలగించారు. డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి సూచనల మేరకు సీఐ సీహెచ్.షణ్ముఖరావు, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు రాకపోకలను క్రమబద్ధీకరించారు.
- వర్షం అరటి, చెరకు, మామిడి పంటలు, వేసవి దుక్కులు, పంటల సాగుకు ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు. చెరువుల్లో నీరు చేరడంతో వేసవిలో మూగజీవాలకు నీటి కొరత తీరుతుందని పేర్కొన్నారు.



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో ఆరబెట్టిన జొన్నలపై టార్పాలిన్ కప్పుతున్న రైతులు